

# నరకము సత్యము - నేను అక్కడికి వెళ్ళాను

**జెన్నిఫర్ పెరెజ్**

క్రైస్తవ కుటుంబములో పుట్టి, పెరిగిన బాలిక యొక్క సాక్ష్యము. తరువాతి కాలంలో దిగజారి, మత్తు మందులకు బానిసగా మారి, చనిపోయి నరకానికి వెళ్ళి, దేవుని కృప వలన మరియొక అవకాశము అనుగ్రహించబడి, దిగజారిపోతున్న, నులివెచ్చని స్తితిలో ఉన్న అనేకమందికి అత్యవసరమైన వర్తమానము నిచ్చి వెలిగించుటకై ఎన్నుకొన బడినది.

ప్రియమైన సోదర సోదరీమణులారా, దేవుడు మిమ్మును ఆశీర్వదించునుగాక! మీరు మీ పరిశుద్ధ గ్రంధాన్ని తెరచి యోవేలు 2:28 చదవాలని ఆశిస్తున్నాను.

"తరువాత నేను సర్వజనుల మీద నా ఆత్మను కుమ్మరింతును; మీ కుమారులును కుమార్తెలును ప్రవచనములు చెప్పుదురు; మీ ముసలివారు కలలు కందురు, మీ యవనులు దర్శనములు చూతురు."

నా పేరు జెన్నిఫర్ పెరెజ్, నా వయసు 15 సంవత్సరాలు. నా వంటి బాలికకు మీ మధ్యకు వచ్చి, నా తప్పిదాలను తెలుసుకొని ఒప్పుకోగలగడం కష్టమైనది. కాని పరిశుద్దాత్మ సహాయము వలన అది సాధ్యమే ఎందుకంటే, ఆయనే నాకు సహాయము చేస్తాడు, నాకు కావలసిన శక్తిని ఇస్తాడు. ఇది అంతా ప్రభువైన ఏసు క్రీస్తు మహిమ కొరకు మాత్రమేనని ముందుగ నేను చెప్పదలచుకొన్నాను. నేను ఏదో ఒక నూతన సిద్దాంతాన్ని ఆవిష్కరించలనుకోవడం లేదు, నేను చూచినది, విన్నది, అనుభవించిన దానిని మాత్రమే మీకు చెప్పాలనుకొంటున్నాను.

నా కుటుంబం గురించి కొంత చెప్పాలనుకొంటున్నాను. నా తల్లిదండ్రులు క్రైస్తవులు, వారు నాకు ఎప్పుడు మంచి మాదిరికరమైన జీవితాన్ని, ప్రభువు మార్గాన్ని భోదించారు. నేను 3 సంవత్సరాలక్రితం నా సోదరుడు నిక్కీ క్రూజ్ తో పాటు ప్రభువును రక్షకునిగా అంగీకరించుట ద్వారా క్రైస్తవ్యాన్ని స్వీకరించాను. 2 సంవత్సరాలపాటు దేవుని మార్గంలో నడిచాను. కానీ నేను ఉన్నత పాఠశాలలో చేరిన నాటి నుండి తిరుగుబాటు స్వభావాన్ని అలవరచుకొని, దేవుని మార్గాన్ని విడిచిపెట్టేసాను. నా తల్లిదండ్రులపై తిరుగబడడం ప్రారంభించాను. మత్తుమందులకు అలవాటు పడ్డాను. నా స్నేహితులు నాకు వీటన్నిటిని బాగా అలవాటుచేసారు.

నేను క్రైస్తవురాలిని గనుక అనేకమంది స్నేహితులను క్రైస్తవులుగా చేయగలుగుతాను అనుకొనేదానను. కాని దానికి విరుద్దంగా వారే నన్ను లోకాశలవైపుకు లాగేసారు. నా తిరుగుబాటుతనాన్ని నా తల్లిదండ్రులు చిన్నపిల్లల చేష్టగాభావించారు. కాని అది మత్తుమందుల ప్రభావమని గ్రహించలేదు. నేను ఎప్పుడైతే తిరిగుబాటుదారురాలిగా మారిపోయానో, నాలో దురాత్మలు వచ్చి చేరిపోయాయి. నా తల్లిదండ్రులు నన్ను ఎప్పుడూ ఏ స్నేహితుల ఇండ్లలోను ఒక్క రాత్రి కూడా ఉండనిచ్చేవారుకాదు. నేను ఏ పని చేయాలన్నా దొంగచాటుగా చేసేదాన్ని. తరచుగా బడికి పోవడంమానేసేదాన్ని. నేను బడికి వెళ్ళేది కేవలం మత్తుమందుల కొరకే. నేను దానికి బానిసనైపోయాను కానీ ప్రభువే నన్ను దానినుండి తప్పించాడు.

నా సాక్ష్యం 1997 వ సంవత్సరం మే నెల 2వ తేదీన ప్రారంభమౌతుంది. నాకు ఒక స్నేహితుడున్నాడు. అతడు నాకు స్నేహితుడు మాత్రమేనని అతనికి కూడా బాగా తెలుసు. అతని గురించి నాకు బాగానే తెలుసను కొన్నాను గాని, నిజానికి అతని గురించి నాకేమి తెలియదు. ఒక రాత్రి అతను నాకు ఫోన్ చేసి తనతో బయటకు

రమ్మని అడిగాడు. ఆ సమయానికి మా ఇంట్లో నా తల్లిదండ్రులు లేరు. వారి అలవాటుచొప్పున ఒక శుక్రవారపు ప్రార్థనాకూటంలో ఉన్నారు. నాకు ఒంట్లో బాగాలేదని చెప్పి ప్రార్థనాకూటానికి వెళ్ళకుండా ఇంట్లోనే ఉండిపోయాను. వారు పిచ్చి వారు, నేను ఆ రాత్రి నా ప్రత్యేకమైన స్నేహితునితో బయటకు వెళ్ళాలని కోరుకొంటున్నానని వారికి తెలియదు పాపం. ఆ విషయం వారికి తెలిస్తే నన్ను అస్సలు బయటికి వెళ్ళనియ్యరు. వారు ప్రార్థనకు వెళ్ళగానే నా స్నేహితుడు ఫోన్చేసి, తనతో పాటు బయటికి రమ్మని, అందరూ వెళుతున్నారని చెప్పాడు. నా తల్లిదండ్రులకు అవిధేయురాలిగా ఉండడం ఇష్టంలేదు గానీ, వారికి తెలియకుండా వెళితే తప్పులేదనుకొన్నాను. అలాగే చేసాను.

ప్రార్థననుండి వచ్చిన నా తల్లిదండ్రులు నిద్రపోయారు. నేను ముందుగానే వెళ్ళాలని నిర్ణయించుకొన్నాను గనుక, నా స్నేహితుడిని ఇంటి ముందుకు రాకుండా ఏదో ఒక మూలలో దాగిఉండమని చెప్పాను. దుప్పటిక్రింద నా స్థానంలో దిండులు పరిచి కిటికీగుండా బయటకు జారుకొన్నాను. మా ఇల్లు రెండు అంతస్తుల మేడ ఇల్లు. మా ఇంట్లో కిటికీలన్నిటికి మరలు బిగించబడిఉన్నాయి, కానీ, నా తల్లిదండ్రులకు నాపై ఉన్న నమ్మకాన్నిబట్టి నా గది కిటికీలకు అవి బిగించలేదు. వారి నమ్మకాన్ని నేను వాడుకొంటున్నాను. మిద్దెపైనుండి క్రిందకి దూకి బయటకు వచ్చేసాను. కాని దేవునికి నాయెడల ఉన్న ప్రణాలికను బట్టి, అప్పుడు నాకు ఏ హాని జరుగలేదు, ఎందుకంటె ఒకవేళ ఏదైనా హాని జరిగిఉంటే, దేవుని ప్రణాళికకు అంతరాయం ఏర్పడుతుంది కదా.

గబగబా వీదిలోనికి పరుగెత్తాను. అప్పటికే నా స్నేహితుడు అక్కడ కారులో వేచిఉన్నాడు. నేను కారు ఎక్కేసరికి అందులో ముగ్గురఅబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు. నేను మత్తు మందులు సేవించి ఆనందంలో మునిగితేలడం తప్ప ఇంకేమి చేయననుకొన్నాను. కాని కారులో ముగ్గురు అబ్బయిలు, ఒక ఒమ్మాయి ఉన్నారు, నన్ను ఏమైనా చేస్తారేమోననే భయం ఒకప్రక్క ఉన్నప్పటికి, కారులో కూర్చుండిపోయాను, కారు బయలుదేరిపోయింది. నాతో ఫోన్లో మాట్లాడినప్పుడు నా స్నేహితుడు ఊరకే ఊరంతా చుట్టివద్దామన్నాడు. అలా చేస్తే సరదాగా ఉంటుందని సరే అన్నాను. కాని నన్ను ఒక హోటలుకు తీసుకువెళతారని అనుకోలేదు. వారు నన్ను ఒక హోటల్కు తీసుకు వెళ్ళారు. అక్కడికి వెళ్ళినతరువాత, నన్ను హోటల్ లో బట్టలు శుభ్రంచేసే స్థలంలో నన్ను వదలి, వేరొక స్నేహితుడిని తీసుకు వచ్చేవరకు అక్కడే ఉండమని చెప్పారు. సరే అన్నాను గాని వారు హోటల్ లో రూం తీసుకోవడానికి వెళుతున్నారని మాత్రం ఊహించగలిగాను. వారు తిరిగి వచ్చి నన్ను ఆ గదికి తీసుకువెళ్ళారు. గదిలో వారు మనం ఇక్కడ ఒక స్నేహితునికోసం ఎదురు చూస్తున్నాము, అతను రాగానే వెళ్ళిపోదాము అంతకు మించి మరేమి లేదని చెప్పారు. వారి మాటలు నేను నమ్మాను ఎందుకంటే వారు నా స్నేహితులు కదా.

కబుర్లు చెప్పుకోవడం ప్రారంభించాము. మాట్లాడుకొనేటప్పుడు ఏదైనా తాగితే బాగుంటుంది కదా అన్నాను. నా స్నేహితుడు నేను హోటల్ ఎదురుగా ఉన్న ఒక దుకాణానికి వెళ్ళి, మూడు స్ప్రైట్ బోటిల్స్ తీసుకొని గదికి వచ్చేసాము. వారు ఆ పానీయాన్ని గ్లాసులలో పోస్తున్నారు. వారితోపాటు ఒక సంచిని కూడా వారు తెచ్చుకోలేదు, అందువల్ల వారు ఆ పానీయములో ఏమైనా కలుపుతారేమోననే అనుమానము నాకురాలేదు.

నేను విశ్రాంతి గదిలోనికి వెళ్ళి, జుట్టు సరిచేసుకొని వచ్చేసరికి నా గ్లాసు పానీయం సిద్దంగా ఉంది. చప్పరించే స్ట్రాబెర్రి గంను నోట్లోవేసుకొని, ఆ స్ప్రైట్ పానీయాన్ని త్రాగేసాను. ఆ తరువాత ఏమి జరిగిందో నాకు తెలియదు.

నాకు తెలివి వచ్చేసరికి నా ప్రాణం పోయినట్లుగా ఉంది. నేను అప్పటికే ఆసుపత్రిలో ఉన్నాను, నా చుట్టూ డాక్టర్లు, నర్సులు ఉన్నారు. నా ప్రాణం పోయినప్పుడు, పడకపై నా శరీరాన్ని చూసాను. అద్దంలో మనం మన ప్రతిబింబాన్ని చూస్తాముగదా. కాని, నేను అక్కడ నా ప్రతిబింబాన్ని చూడలేదు, ఆ పడకపై నా నిర్జీవదేహాన్ని చూసాను. నేను చుట్టూ చూసేసరికి ఎర్రని వస్త్రాలు ధరించిన ఇద్దరు కనబడ్డారు, వారు నా చెరో చేయి పట్టుకొని మాతో రా అని లాక్కుపోసాగారు.

వారు నన్నొక స్థలానికి తీసుకు వెళ్ళారు, అది పరలోకం. నేను అక్కడ మొదటగా ఒక పెద్ద తెల్లని గోడను చూసాను. అది చాలా పెద్దది పొడవైనది, దాని చివర కనబడుటలేదు. దానికి మధ్యలో ఒక పెద్ద ద్వారం ఉంది, అది మూయబడి ఉంది.

పాతనిభంధన గ్రంధంలో మోషే ప్రత్యక్షపు గుడారాన్నిగురించి వివరిస్తాడు. అది నాకు గుర్తుకు వచ్చింది, ఆ గోడ అలాగే అన్పించింది. ఆ ద్వారానికి కుడిప్రక్క ఒక పెద్ద సింహాసనం ఉంది, దానికి కుడిప్రక్కన ఒక చిన్న సింహాసనం ఉంది. అవి బంగారంతో చేయబడినట్లుగా ఉన్నాయి. నా కుడి ప్రక్కన ఒక పెద్ద నల్లటి ద్వారం ఉంది. దానికి ఉన్న గడియను బట్టి అది ద్వారమని గుర్తించాడానికి వీలౌతుంది, ఎందుకంటే అక్కడ అంత చీకటిగా ఉంది. ఆ ద్వారం చాలా అసహ్యంగా ఉంది. నా ఎడమ ప్రక్కన పరలోకముంది, అక్కడ పచ్చటిచెట్లు, స్వచ్చమైన జలధారలు, అందమైన పచ్చికబయళ్ళు ఉన్నాయి. అది చాలా ప్రశాంతమైన స్థలము, కాని అక్కడ ఎవరూ లేరు.

నేను చుట్టూ చూచుచుండగా, నా పరలోకపు తండ్రి కనిపించాడు, ఆయన ముఖము అత్యంత ప్రకాశమానముగా ఉన్నందువలన నేను అయన ముఖాన్ని చూడలేకపోయాను. ఆయన ముఖకాంతితో పరలొకం ప్రకాశిస్తూఉంది. అక్కడ సూర్య చంద్ర నక్షత్రాలు లేవు, ఆయనే అక్కడ వెలుగు. ఆయన శరీరాన్ని చూడగలిగాను, ఆయన ప్రక్కన కుమారుడున్నాడు. వారిద్దరు వేరువేరుగా ఉన్నట్టున్నప్పటికి, వారు కలిసే ఉన్నట్లుగా ఉన్నారు.

వారి ప్రక్కన ఇద్దరు దేవదూతలు ఉన్నారు, వారు గబ్రియేలు మరియు మిఖాయేలు. వారి పేర్లు సువర్ణాక్షరములతో వారి నుదుళ్ళపై వ్రాయబడి ఉన్నవి.

నేను నా పరలోకపు తండ్రి ముందు నిలవడినప్పుడు నేను నా మురికినంతా చూడగలిగాను. మోకాళ్ళపైబడి ఏడ్వసాగాను. నేను సిగ్గుతో కుచించుకుపోయాను. వారిని చూడగలవీలున్నప్పటికిని, నా సిగ్గును బట్టి వారిని చూడనొల్లకపోయాను. ఆయన నా జీవితాన్నంతటిని ఇప్పటివరకు నాకు చూపించారు. ఆయన నాకు చెప్పినదేమనగా, నా జీవితములో అతి ప్రాముఖ్యమైన దినములు నేను రక్షింపబడిన తరువాతి దినములేనని. నేను నా స్నేహితులతో క్రైస్తవరాలునని చెప్పుకొన్నానుగాని, దాని ఫలాలను చూపించలేకపోయాను. అందునుబట్టి నేను నరకానికి వెళ్ళవలెనని ఆయన నాతో చెప్పారు.

గబ్రియేలు దూత నాదగ్గరకు వచ్చి, నా చేయి పట్టుకొని నన్ను ఆ అసహ్యమైన ద్వారము వద్దకు తీసుకుపోయాడు. నేను వెళ్ళకుండా ఉండడానికి ప్రయత్నించాను గాని నేను ఆత్మరూపిని గనుక ద్వారంగుండా లాగివేయబడ్డాను. ఆ ద్వారానికి అవతలి ప్రక్కనిలిచినపుడు అక్కడ అంతా కటిక చీకటే. అక్కడి నుండి చాలా వేగంగా క్రిందికి పడిపోవడం ప్రారంభించాను. క్రిందికి పడేకొద్ది, వేడి పెరిగిపోసాగింది. నేను ఎక్కడ ఉన్నానోకూడా తెలుసుకోవాలనిపించలేదు గనుక నా కళ్ళు గట్టిగా మూసుకొన్నాను.

ఒక చోట నిలిచినప్పుడు నా కళ్ళు తెరచి చూసేసరికి మేము ఒక పెద్ద రహదారిపై ఉన్నాము. అది ఎక్కడికి పోతుందో నాకు తెలియదు. నాకు చాలా దాహంగా అనిపించసాగింది. నేను ఆ దూతతో నాకు చాలా దాహంగా ఉందని చెప్పాను గాని, అతను నా మాటలు వింటున్నట్లుగా లేదు. నేను ఏడ్వడం ప్రారంభించాను, నా కళ్ళనుండి కారుతున్న కన్నీరు ఆవిరైపోసాగింది. రబ్బరు కాలుతున్నట్లుగా గంధకపు వాసన. నా ముక్కు మూసుకోవడానికి ప్రయత్నించేకొలది అధికమౌతోంది. నా స్పర్శాంగాలన్ని బాగుగా పనిచేస్తున్నాయి. నేను కప్పుకొనేకొద్ది గంధకపు వాసన అధికంకాసాగింది. అక్కడ ఉన్న భయంకరమైన వేడికి నా చేతిపై ఉన్న చిన్న చిన్న వెంట్రుకలన్ని అదృశ్యమైపోసాగాయి.

నేను చుట్టూకలియజూసినప్పుడు, దురాత్మలచే పీడింపబడుచున్న అనేకమంది కనబడిరి. ఒక స్త్రీ ఉన్నది, ఆమెను ఒక దురాత్మ హింసించుచున్నది. ఆ దురాత్మ ఆమెను ఒక పొడవైన కొరడాతో శరీరమంతట కొట్టుచుండెను. ఆమె తలను నరికివేసి ఆమెను కొట్టుచున్నది మరలా తిరిగి ఆమె తలను మొండెమునకు తగిలించి కొట్టుచుండెను. ఆమె వేదనాభరితమైన బాదతో మూల్గుచూ రోదించుచుండెను.

నేను ఇంకొక దురాత్మను చూచితిని, అది 21-23 ఏండ్ల వయస్సున్న ఒక యువకుని హింసించుచుండెను. ఇతని మెడ గొలుసులతో భందించబడి ఒక అగ్నిగుండము ముందు నిలబడియుండెను. ఆ దురాత్మ అతనిని ఒక పొడవాటి కొరడాతో బాదించుచుండెను, కన్నులలో పొడచుచుండెను. అతని జుట్టుపట్టుకొని ఆ అగ్నిగుండములోనికి త్రోసివేసి మరల బయటికి లాగి, మరల మరల హింసించుచుండెను. ఈ విధముగ నిరంతరాయముగ చేయుచుండెను. అతను అగ్నిగుండములోనికి త్రోయబడినప్పుడు అతని మూల్గులు వినబడలేదు గానీ అతడు బయటికి తీయబడినప్పుడు, అతని రోదన వినబడుచుండెను. ఆ రోదన వినలేక నా చెవులను మూసుకొనప్రయత్నించితిని గాని మరి ఎక్కువగా వినబడుచుండెను.

నేను ఇంకొక దురాత్మను చూచితిని. ఇది వికృతముగా ఉన్నది, మిగిలినవి కూడా అట్లే ఉన్నవి గానీ ఇది మరీ వికృతముగా ఉన్నది. ఇది వర్ణించనలవికాని రకరకములైన జంతువుల లక్షణములను కలిగిఉన్నది. అది కలియదిరుగుచు, ప్రజలను భయపెట్టుచుండెను, దానిని చూసిన ప్రజలు భయపడుచుండిరి.

పిదప నేను మరియొక అందమైన దురాత్మను చూసితిని. ఇది దేవదూతవలే ఉండెను గాని అది దేవదూత కాదు. అక్కడ ఉన్న దేవదూతలకు, దురాత్మలకు భేదమేమనగా, దేవదూతలకు నొసళ్ళపై బంగారు అక్షరములతో వారి పేర్లు లిఖించబడి ఉన్నవి కాని, దురాత్మలకు అట్లు లేదు.

పిదప నేను గబ్రియేలు దేవదూతవైపు చూచితిని, ఆయన పైకి చూచుచుండెను. బాదింపబడుచున్న వారిని చూడలేక పైకి చూచుచున్నాడని నేననుకొంటిని. ఆయన ఇంకా ఎందుకు ఇక్కడే నిలచియున్నాడో, నన్ను శిక్షింపబడుటకు ఇక్కడే వదలివేసి ఎందుకు వెళ్ళిపోలేదని ఆలోచించుచుంటిని. నేను చాలా దప్పిగొనుచున్నాను. అందువలన నాకు దాహమగుచున్నది, దాహమగుచున్నదని గట్టిగా అరచుచుంటిని. ఆయన నా అరుపులు వినినట్లు ఉన్నాడు, నావైపు చూచి ప్రభువు నీకు ఇంకొక అవకాశం ఇవ్వగోరుచున్నాడు అని చెప్పాడు.

ఆయన ఈ మాట పలికిన వెంటనే దాహము, భాద, వేదన నన్ను విడిచిపోయినవి. నేను సమాదానము పొందుకొంటిని. ఆయన నన్ను చేయిపట్టుకొని పైకి తీసుకొనిపోవునంతలో, జెన్నిఫర్ నాకు సహాయము చేయి అని నా పేరు పెట్టి పిలవడం వినబడింది. అలా పిలచినది ఎవరోచూడగోరితిని గాని ఆ అగ్ని జ్వాలలవెనుకనుండి వారి ముఖము కనబడలేదు. అది ఒక అమ్మాయి స్వరము. ఆమె రక్షించమని చాపుచున్న చేతులు మాత్రము కనబడుచున్నవి. ఆమెను రక్షించవలెనని కోరినను, ఆమెను రక్షింపజాలకుంటిని.

నేను అక్కడ నా స్నేహితులను, ఇరుగుపొరుగువారిని, తెలిసినవారిని చాలమందిని చూసాను. వారి ముఖాలు తెలిసినవారి వలె ఉన్నవి గాని, వారిని గుర్తుపట్టలేకపోతున్నాను. "బహుశా వారు నా వల్లే ఇక్కడికి వచ్చి ఉంటారని ఎందుకంటే, నేను క్రైస్తవురాలినని చెప్పుకొంటూ, దానినుండి తొలగిపోయాను గనుక" అని అప్పుడు నాకు అనిపించింది. నారకానికి వారసులైనవారికి, అక్కడ పగలు, రాత్రి, ప్రస్తుతం, గతం అనేవి లేవని నాకు అర్థమైంది. నేను ముందుగా చెప్పినట్లుగా ఏదో ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాలని కాదు గానీ, ఇది నేను అక్కడ చూసింది మాత్రమే. నేను అక్కడ చూసినవారు ఇప్పటికి అక్కడ బ్రతికే ఉన్నారు.

అక్కడినుండి నన్ను ఆ దేవదూత దేవుని సన్నిధికి తీసుకు వచ్చింది. ఆయన సన్నిధిలోనికి వచ్చినవెంటనే నేను మోకాళ్ళపైపడి రోదించడం మొదలుపెట్టాను. సిగ్గుతో అయన ముఖము చూచుటకు నాకు మనస్కరించలేదు. కానీ ఆయన తన మధురమైన స్వరంతో "నిన్ను నేను ప్రేమిస్తున్నాను", అని నాతో ముఖాముఖీగా చెప్పారు. ఆ మాటతో ఆయన నా పాపములను క్షమించారు.

ఆయన నావైపుచూసి, నాకు చాలా సంగతులను చూపించారు. ఆయన భూప్రపంచాన్ని చూపించారు. ఈ భూమి చుట్టూ నేను ఒక మృదువైన పొరను చూసాను, దానిని ముట్టుకోవాలన్నంత మృదువుగాఉంది. దానిని నేను తాకినప్పుడు, అది పరిశుద్ధాత్మనిగా నేను గ్రహించగలిగాను, ఎందుకంటే నాకు ఆయన పరిశుద్ధాత్మలో బాప్తీస్మము ఇచ్చాడు, వెంటనే నేను భాషలలో మాట్లాడసాగాను. ఆ సమయంలో నాలోనుండి అనేకమైన దురాత్మలు బయటికిపోవడం నేను గ్రహించాను. నేను మత్తుమందులు సేవించేటప్పుడు, నాహృదయపు ద్వారాలు తెరవబడి, దురాత్మలు నాలో వచ్చిచేరేవి. అవి నన్ను బాధించేవి. అప్పటి నా ప్రవర్తన నాదికాదుగాని ఆ దురాత్మలదే. మన ఇంటిని శుభ్రపరచి వుంచినపుడు దురాత్మలు మరొక ఏడు దురాత్మలను తేసుకొని వచ్చి అందులో ప్రవేశిస్తాయని పరిశుద్ధగ్రంథము నందు వ్రాయబడి ఉన్నది. నేను మొదటి సారి బాప్తీస్మము పొందినపుడు నా హృదయము శుభ్రముగా ఉన్నది, అందులో మొదట ఏడు దయ్యములు, వాటితో మరి ఏడు దాయ్యములు, వాటితో మరి ఏడు దాయ్యములు ఈ విధముగ లెక్కించలేనన్ని దయ్యములు వచ్చి చేరినవి. కానీ ప్రభువు ఇప్పుడు వీటన్నిటిని నాలోనుండి పారద్రోలివేసి నన్ను పరిశుద్ధపరచాడు.

ఆయన నాకు భవిష్యత్తును కూడా చూపించారు. భూమిని దానిపై జరగబోవు సంగతులను చూపించారు. ఇప్పటినుండి ప్రభువు రెండవరాకడ వరకు సంగతులను చూపించారు. ఆయన నాకు రెండవరాకడను చూపించలేదు గానీ దానికి ముందు జరగబోవు సంగతులను చూపించారు. మనం రోజురోజుకు ప్రభువు రాకడకు దగ్గరవుతున్నాము, మనం ఆయనతో వెళ్ళడానికి సిద్దంగా ఉన్నామోలేదో మనల్నిమనం పరీక్షించుకోవాలి. ఆయన నాకు అనేక సంగతులను చూపించి, ఎవరికి వాటిని చెప్పవద్దని, అంతమువరకు కనిపెట్టుకొని ఉండమని ఆదేశించారు. అందుకనే వాటిని వివరించుటలేదు. కాని అంతము సమీపముగా ఉన్నదని మాత్రము చెప్పుచున్నాను, మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను.

మరియొకసారి యోవేలు 2:28 చదువుతాను, ఇది చివరిగా చెప్పబడిన ప్రవచనములలో ఒకటి, అన్ని ప్రవచనములు నెరవేర్చబడినవి. ఈ ప్రవచనము కూడా ఇప్పుడు నెరవేరినది. అనేకమంది యువనులు దేవుని వాక్యాన్ని ప్రచురపరస్తున్నారు. సాతాను అనేకమంది యువనులతో తనకొక సైన్యాన్ని తయారుచేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు గానీ, దేవుడు సర్వశక్తిమంతుడు. నీవు నిజంగా దేవుని నీ స్వంతరక్షకునిగా అంగీకరించి ఆయనను సేవించాలనుకొంటే, సైతానును జయించడానికి కావలసిన శక్తిని ఆయన నీకు సమృద్ధిగా దయచేస్తాడు. అప్పుడు నీవు పరిశుద్ధగ్రంథములో ఆదేశించబడిన ప్రకారం నీవు సర్వ సృష్టికి సువార్తను ప్రకటిస్తావు.

ఆయన నాకొక కార్యభారాన్ని అప్పగించారు, అది ఏమిటంటే నేను చూసిన దర్శనాన్ని యవనులకు వివరించడం. ఇది ఒక ఆదేశంగా నాకు ఇచ్చారు, దీనిని నేను నెరవేరుస్తాను.

నేను నా దేహములోనికి తిరిగి ప్రవేశించినపుడు, నేను ఆసుపత్రిలో ఉన్నాను. నేను గమనించి చూడగా నా దేహమునకు గుచ్చబడిన సూదులు, గుండె పనితీరును గమనించు పరికరములు, ఇతర నాళములు కనిపించాయి. నా తల్లిదండ్రులను చూచి ఏడ్వడం ప్రారంభించాను. వారు పిచ్చివారివలే ఉన్నారు, వారికి జరిగిన సంగతులనన్నిటిని తెలియజేయమని దేవుడు నాకు ఆదేశించినందున, వారికి అన్నీ వివరించి చెప్పాను.

నా తాల్లిదండ్రులు నాకొరకు ఎంతో భయపడినట్లు, నర్సు నాతో చెప్పింది. నేను స్పృహలోనికి వస్తూ మగతలోనికి జారుకొటూ ఆవిధముగా మూడుసార్లు జరిగినట్లుగా నర్సు నాకు చెప్పింది. ఒక సారి నేను స్పృహలోనికి రానప్పుడు వారెంతో కలవరపడ్డట్టు చెప్పింది. ఒకసారి నోటినుండి నురుగు వచ్చి అర్థంగాని విధంగా మాట్లాడినట్లు చెప్పింది.

మరియు ఆ రోజు రాత్రి నా తల్లికి చెడ్డ కలలు కూడా వచ్చాయట. నాతో పండుకొనే కుక్కపిల్ల రాత్రి సమయములో వెళ్ళి నా తల్లిని కాళ్ళతో గీరి నిద్రలేపిందట, నా తల్లి నా గదికి వచ్చి మంచముపై దుప్పటిక్రింద పేర్చబడిన దిండ్లు చూచి నేను నిద్రపోతున్నానని తలంచి వెళ్ళబోయి, కిటికీ గుండా పోలీసు వారి వాహనాల కాంతిని గమనించి, అటుచూడగ, వారు తమ ఇంటికే వస్తున్నట్లు గమనించి, నా తండ్రిని నిద్రలేపిందట. వారు నేను అతిగా మత్తుమందులు సేవించి ఆసుపత్రిలో ఉన్నట్లు తెలిపారట. అదే సమయములో దేవుడు నా తండ్రితో నీవు భయపడవద్దు, అంతయు నా ఆధీనములోనే ఉన్నదని తెలిపారట, అందువలన నా తండ్రి ధైర్యముగా ఉన్నారు. నేను మూడు దినములు ఆసుపత్రిలోనే ఉన్నాను.

ఒక వారము దినముల తరువాత గూఢచారులతో మాట్లాడినప్పుడు, ఆ రాత్రి జరిగినది వారు మాకు వివరించారు. నాతోపాటు వచ్చిన వేరొక అమ్మాయి కనిపించకపోయేసరికి, ఆమె తండ్రి, ఆమె కొరకు వెదకి ఆమెను కనుగొనలేకపోయాడు. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసాడు. వారు నా స్నేహితుడు వాడుతున్న కారు వివరములను విధులలో ఉన్న అందరు గస్తీపోలీసులకు తెలియజేసి హెచ్చరించారు. అదే సమయములో విధులు ముగించుకొని ఒక పాత కారును కొనుటకు ఒక దుకాణము దగ్గర ఉన్న పోలీసు నా స్నేహితుని కారును గమనించి, పోలీసులకు తెలియజేసాడు.

వారు కారును వెదకవెళ్ళినప్పుడు ఆ కారు ఒక చోట నిలిపి ఉండడం గమనించారు గానీ ఆ అమ్మాయి ఆచూకి పట్టుకోలేకపోయారు. మేము హోటలు రెండవ అంతస్తులోని మూలగదిలో ఉన్నాము. వారు బయట నిలిపి ఉన్న ఆ వాహనం యజమాని ఎవరో తెలుసుకోవడానికి ప్రయత్నించసాగారు. వారు మా గది తలుపు తెరచినపుడు నేను నేల పైపడిఉండడం గమనించి వెళ్ళిపోయారు. వారు అలా వెళ్ళిపోవడం గమనించిన నా స్నేహితులు చాలా సంతోషించారు. కానీ వారు వెళ్ళింది ఆంబులెన్సును పిలచుకు రావడానికని వారికి తెలియలేదు. అంతలోనే అక్కడ ఏమి జరుగుతోందో తెలుసుకోవడానికి మిగిలిన పోలీసులు వచ్చేసారు. వారు తలుపు తెరచి వచ్చిచూసేసరికి నేను బహుగా నమ్మిన నా స్నేహితుడు నాపై అత్యాచారం చేయబోతున్నాడు. కానీ సమయానికి పోలీసులను పంపడం ద్వారా నాకు ఏ హాని జరుగకుండా దేవుడు తన మహా కృపనుబట్టి నన్ను కాపాడాడు. ఆయనకు నాపై ఉన్న కృపను బట్టి ఆయనకు వందనాలు చెల్లిస్తున్నాను.

తల్లిదండ్రులైనవారలారా, నా తల్లిదండ్రుల ప్రార్థనల వలన కూడా నేను తప్పించబడ్డాను. అందువలన మీ బిడ్డల కొరకు ప్రార్థించడం మానవద్దు. ఒక వేళ మీ బిడ్డలు దేవునితో నడచువారు కానట్లైతే మరి ఎక్కువగా వారి కొరకు ప్రార్థించండి. నా తల్లిదండ్రుల ప్రార్థనలవలననే నేను ఈ నాడు యవనబిడ్డలకు పరిచర్య చేయ

గలుగు చున్నాను. వారికి ఏసు అవసరమని, ఆయనను పొందుకొని, ఆయన సేవలో పాలిభాగస్తులు కావాలని వారిని ప్రాధేయపడుతున్నాను.

నేను యవనులైన వారికందరికి తెలిపే వర్తమానం ఏమనగా, మీరు మీ గురించి ఆలోచించండి, మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి. నా గురించి ఇతరులు ఏమనుకొంటున్నారో అని నేనెందుకు పట్టించుకోవాలని తలంచండి. నేనైతే వారు నా గురించి ఏమి అనుకొంటున్నారో అని దిగులు పడుతుండేదానను, కాని ఇప్పుడు నాకు తెలిసిపోయింది, వారు నన్నసలు పట్టించుకోరని. ప్రభువు మన ముందుకు వచ్చి నిలచినపుడు వారు ఆయన ముందు నిలవలేరు. నాకు బాగా గుర్తుంది, నేను ప్రభువు ముందు నిలువబడినప్పుడు, నా స్నేహితులుగాని, తల్లిదండ్రులుగాని, సంఘసేవకులుగాని, సంఘముగాని నాకు ఏ విధముగను సహాయపడలేదు. నేను ఒంటరిగానే నిలవబడి, నన్ను నేను సమర్ధించుకోవలసి ఉంది. ఆయన మహా పరిశుద్దుడు గనుక ఆయన ముందు ఎంతమాత్రము అబద్దాలు పలుకలేవు. నేను అక్కడ నిలువబడినప్పుడు నేను ఆ స్థలమునకు ఎంతమాత్రమూ అర్హురాలను కానని అర్థమైపోయింది, ఎందుకంటే అది పరిశుద్దస్థలము, నేనైతే పాపిని.

నేను మీకు ఈ రోజు తెలియజేయునది యేమనగా, నీవు ఇప్పటికి ఏసు ప్రభువును నీ రక్షకునిగా అంగీకరించకపోయి ఉంటే, నేడే అంగీకరించు. ఇది నీ జీవిత మంతటిలో నీవు తీసుకొనే గొప్ప నిర్ణయం ఔతుంది. ఇదంతా మీకు చెబుతోంది, మిమ్మల్ని పరలోక విషయమై భయపెట్టడానికి కాదు గాని, మన పరమ తండ్రికి మన యెడల ఉన్న ప్రేమను మీరు గ్రహించాలని చెబుతున్నాను. ఆయన మనకొరకు సిలువపై పాపప్రాయశ్చిత్త బలిగా చనిపోవుటకు తన ప్రియ కుమారుణ్ణి ఈ లోకానికి పంపించాడు. ఆయన కల్వరి సిలువలో చిందించిన ప్రతి రక్తపుబొట్టు వలన మనకు పాపక్షమాపణ దొరుకుతుంది. నీవు ఏసును నీ రక్షకుని అంగీకరించినట్లైతే, అది నీ జీవితంలో గొప్ప నిర్ణయమౌతుంది. నేడే ఏసునొద్దకు రా, ఎవరేమనుకొన్నా లెక్కచేయవద్దు.

నీవు దేవుని సేవ చేయాలని నిర్ణయించుకొంటే, హృదయమంతటితో సేవచేయి. నీ నాలుకతో మాత్రము కాక నీ హృదయమంతటితో చేయి. రేపటి గురించి చింతించ వద్దు, నేటి గురించే ఆలోచించు, నీవు ఎప్పుడు మరణిస్తావో నీకు తెలియదు. నా వయసు 15 సంవత్సరాలు, నేను 15 సంవత్సరాలకే చనిపోతానని ఎప్పుడు ఊహించలేదు.

ఇది నీవు తెలుసుకోవాలి. నా జీవితం నాది కాదు, మీ జీవితం మీది కాదు, దేవునికి చెందినవి. ఆయన నిర్ణయించినంత కాలం బ్రతుకుతాము. దీనిని మనం తెలుసుకోకుండా, లోక సంభందమైన క్రియలను చేస్తూఉంటాము. ఈ లోకం మనకు చాలా ఇవ్వజూపుతుంది గాని, దేవుడు మనకు ఇచ్చేవి బహు ఉన్నతమైనవి, మితిలేనివి. ఈ ప్రపంచం మనల్ని మరణానికి, నరకానికి నడిపిస్తుంది. కాని, దేవుడైతే నిత్యజీవితాన్ని మనకు ఇస్తాడు. నిత్యజీవితం అంతంలేనిది, అది ఎల్లప్పుడు నిలచి ఉండేది.

ఇప్పుడు నీవు ఏసు ప్రభువును నీ రక్షకునిగా అంగీకరిస్తున్నట్లైతే, నీవు నాతో పాటు తల వంచి ప్రార్థించాలని కోరుతున్నాను. "ప్రభువైన దేవా, ఏసు క్రీస్తు వారి నామంలో నేను నీ సన్నిధిలోనికి వస్తున్నాను. నిన్ను నా స్వంత రక్షకునిగా అంగీకరిస్తున్నాను. నీవు నా జీవితములోనికి రావాలని కోరుకుంటున్నాను. నేను నరకానికి పోవడానికి ఇష్టపడుటలేదు, అసలు నరకమనే ఊహే భరించలేను. ప్రభువా నేను చేసిన పాపములన్నిటిని దయతో క్షమించుము. నేను చేసిన ప్రతికార్యము విషయములోను నన్ను క్షమించుము. నేను చేసిన ప్రతి చిన్నపాపమును కూడా మీ ఎదుట ఒప్పుకొనుచున్నాను, కనికరించి క్షమించుము. నీవు కల్వరి సిలువలో నా కొరకు మరణించి, తిరిగి సజీవుడుగా లేచావని నమ్ముచున్నాను. నీవు నా హృదయములోనికి వచ్చి,

నా రాజుగా ఉండి, నాలో నివసిస్తావని నమ్ముచున్నాను. నేను నీ వాక్యాన్ని అనుదినం ధ్యానిస్తాను. నేను నీ మందిరానికి వెళతాను, ఎందుకంటె, నీవు అక్కడ నివసిస్తూఉంటావు గనుక. ఇద్దరు ముగ్గురు నా నామములో ఏకీభవిస్తే వారి మధ్యను నేను ఉంటానని సెలవిచ్చావు. నా ప్రభువా నీవు ఎక్కడ ఉంటే అక్కడ నేను ఉండాలని కోరుకోటున్నాను. ఈ ప్రార్థన ఏసు క్రీస్తువారి నామమున చేయుచున్నాను. ఆమేన్."

మీరు ఈ ప్రార్థన గనుక చేసిఉంటే, దేవుని రాజ్యంలోనికి మీకు ఆహ్వానం పలుకుతున్నాను. ఇప్పుడు మీకు ప్రపంచం నలుమూలల సహోదర, సహోదరీలు ఉన్నారు. ఇది మీ జీవితంలో మీరు తీసుకొన్న అద్భుతమైన నిర్ణయం. దీని నుండి వెనుకకు లోకాశలవైపు మరలిపోవద్దు. లోకాశలు మరణానికి నడిపిస్తాయి, దేవుడైతే నిత్యజీవానికి నడిపిస్తాడు. ఇక నీ జీవితములో ప్రతిక్షణం ఇదే నీకు అఖరి క్షణం అన్నట్లుగా జీవించాలి. నా ఈ సాక్ష్యము మిమ్మల్ని కదిలించినట్లైతే, దీనిని వేరొకరికి వారి రక్షణార్థం ఇవ్వండి. సమయాన్ని వృధాగా పోనియ్యకండి, ఇదే మీ ఆఖరి క్షణం కావచ్చు.

## నరకము సత్యము - నేను అక్కడికి వెళ్ళాను

*జెన్నిఫర్ పెరెజ్*

Translated to Telugu by T. J. H. Prasad Babu, prasadbabutjh@gmail.com